13 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 13 మందికి సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 13 మంది పట్టుబడగా వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి 13 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రేవంత్‌ని సీఎం చేయాలంటూ హోర్డింగ్ ఎక్కిన వ్యక్తి



హోర్డింగ్ ఎక్కిన వెంకటేశ్వర్

పటాన్‌చెరు టౌన్: రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలంటూ ఓ వ్యక్తి హోర్డింగ్ ఎక్కిన సంఘటన పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓఆర్ఆర్ సమీపంలో చోటుచేసుకుంది.సీఐ లాలూ నాయక్ కథనం ప్రకారం.. బతుకుదెరువు కోసం ఖమ్మం నుండి వచ్చి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉంటున్న వెంకటేశ్వర్ అనే వ్యక్తి రేవంత్‌రెడ్డిని సీఎం చేయాలంటూ మంగళవారం సాయంత్రం హోర్డింగ్ ఎక్కాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని కిందకు దించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్ తనంతట తానే కిందికి దిగి ఇస్నాపూర్ వెళ్లిపోయాడు.


శుభమస్తు

జీహెచ్‌ఎంసీ ఫంక్షన్‌హాల్ రెడీ..

- గోపన్‌పల్లితండాలో 4 ఎకరాల్లో రూ.3.95 కోట్లతో మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్
- పేద, మధ్యతరగతి కుటుంబాల వారికి ఊరట



గోపన్‌పల్లితండాలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్





రాయదుర్గం: ఎట్టకేలకు మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్ సిద్ధమవుతోంది. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లితండాలో నెల రోజుల క్రితం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ,జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. దీంతో ఈ ప్రాంతవాసులకు సౌకర్యం కలిగింది. అయితే ఈ ఫంక్షన్‌హాల్ అద్దెను నిర్ణయించి వెంటనే అందుబాటులోకి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్ వివరాలు..

- 4 ఎకరాలలో మొత్తం రూ.3.95 కోట్లతో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మించారు.
- 2015 అక్టోబర్ 29న రూ.1.72 కోట్ల వ్యయంతో అప్పటి రవాణా శాఖామంత్రి డాక్టర్ పి మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.
- గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ వరకు నిర్మించి తదనంతరం వదిలేశారు. దాదాపు ఆరున్నరేళ్ళు నిలిచిపోయాయి. అనంతరం మరో రూ.1.70 కోట్ల వ్యయంతో మిగిలిన పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.
- కిచెన్, స్నానపుగదులు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, ప్రధాన గేటు, గ్రీనరీ, ప్రహరీగోడ, ఇతర వసతులు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- అధునాతన హంగులతో భారీ హాల్‌లో స్టేజి, పక్కన రెండు గదులు, పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

20 వేల మందికి సౌకర్యం..

- గోపన్‌పల్లితండాతో పాటు గోపన్‌పల్లి, వీకర్ సెక్షన్ కాలనీ, ఎన్టీఆర్‌నగర్, తాజ్‌నగర్, సోఫాకాలనీ, గౌలిదొడ్డి, బసవ తారకనగర్, కేశవనగర్, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి ప్రాంతాలలోని సుమారు 20వేల మందికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.
- ఇంకా ఫంక్షన్‌హాల్‌లో పూర్తిస్థాయిలో వంటగది నిర్మించాల్సి ఉంది
- ఫంక్షన్‌హాల్‌కు అవసరమైన వంట సామగ్రిని కూడా సిద్ధం చేయించాల్సి ఉంది
- అంతేకాకుండా ఫంక్షన్‌హాల్ అద్దెను నిర్ధారణ చేయాల్సి ఉంది
- అన్నివర్గాల వారిని దృష్టిలో పెట్టుకొని అద్దె నిర్ణయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు ఎంతో ఉపయోగం



ఈ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరం. శుభకార్యాలను చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది. ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న ప్రజల కోరిక నెరవేరినట్లయింది. అందరూ ఎంతో సంతోషంగా ఉన్నారు. తక్కువ వ్యయంతో ఫంక్షన్లు చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది.

–గంగాధర్‌రెడ్డి, కార్పొరేటర్, గచ్చిబౌలి

ఎమ్మెల్యే చొరవతో పూర్తి



ఎమ్మెల్యే గాంధీ, జీహెచ్‌ఎంసీ అధికారుల చొరవతో నిర్మాణం పూర్తి అయింది. పనులు నిలిచిపోయిన చోట ఎమ్మెల్యే అదనంగా నిధులు మంజూరు చేయించారు. ఈ ఫంక్షన్ హాల్‌తో పేద మధ్య తరగతి వర్గాలకు మేలు జరుగుతుంది.

– సాయిబాబా, మాజీ కార్పొరేటర్ ,గచ్చిబౌలి

తక్కువ ధరకే ఐఫోన్ అంటూ మెసేజ్..

- సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
- రూ.6 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: ఇన్‌స్టాగ్రామ్‌లో ఐఫోన్ తక్కువ ధరకనే మెసేజ్ రావడంతో కొనడానికి ప్రయత్నించే క్రమంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.ఆరు లక్షల 2 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ రాఘవేంద్ర కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సెప్టెంబర్ 25వ తేదీన ఇన్‌స్టాగామ్‌లో ఐఫోన్ 13 వేలకు వస్తుందని వచ్చిన మెసేజ్‌ను చూసి అపరిచిత వ్యక్తిని సంప్రదించారు.దీంతో ఆ వ్యక్తి ఓ లింకు పంపగా తన వివరాలు నమోదు చేశాడు.అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా చేయడంతో ఐదు దఫాలుగా తన ఖాతాలో ఉన్న రూ. ఆరు లక్షల రెండు వేలు పోగొట్టుకున్నాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి మంగళవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లోన్ ఇస్తామంటూ వచ్చిన ఫోన్ కాల్‌కు..

- రెండు లక్షల 71 వేలు పోగొట్టుకున్న గృహిణి

లోన్ ఇస్తామంటూ వచ్చిన ఫోన్‌కాల్‌కు స్పందించి, ఓ గృహిణి రూ.రెండు లక్షల 71 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్‌కు చెందిన ఓ గృహిణికి నవంబర్ 6 వ తేదీన రూ.లక్ష రూపాయలు లోన్ ఇస్తామంటూ ఫోన్ కాల్ వచ్చింది.దీంతో బాధితురాలు అపరిచిత వ్యక్తి పంపిన లింకులో తన వివరాలు నమోదు చేసింది.నమోదు చేసిన కొద్దిసేపటికి తన ఖాతాలో ఉన్న రూ.రెండు లక్షల 71 వేలు పోగొట్టుకుంది. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి బాధితురాలు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, మంగళవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మనూ భోపాల్ క్యాంపస్ ప్రారంభం



క్యాంపస్ ప్రారంభోత్సవంలో వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: భవిష్యత్తులో మనూను శాటిలైట్ క్యాంపస్‌గా మార్చే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ తెలిపారు. మంగళవారం భోపాల్ క్యాంపస్‌ను వీసీ ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ 6.44 ఎకరాల భూమిలో విస్తరించి ఉన్న భోపాల్ క్యాంపస్ ఇప్పుడు 'మనూ' కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్(సీటీఈ),'మనూ' ప్రాంతీయ కేంద్రాలకు నిలయంగా ఉందన్నారు.

కాంగ్రెస్ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి

మియాపూర్ : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలు నియోజకవర్గ ప్రజానీకానికి అందేలా కృషి చేస్తానని జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. మియాపూర్‌లోని విశ్వనాథ్ గార్డెన్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సేవచేయాలనే ఆశయానికి బలం చేకూర్చే విధంగా నా వెంట నడిచిన శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు రాష్ట్రం మొత్తం కాంగ్రెస్ జెండా రెపరెపలాడుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషిచేస్తానని తెలిపారు. ఎలాంటి సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని ఎప్పుడూ అందుబాటులో ఉంటూ పరిష్కారానికి తమవంతు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.జగదీశ్వర్‌గౌడ్

అటెన్షన్ ప్లీజ్...

కొట్టేసి..వదిలేశారు..



లోటస్‌పాండ్‌లో రోడ్డుపక్కన చెట్టు కొమ్మలు, వ్యర్థాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం .12లోని లోటస్‌పాండ్‌లో పది రోజుల క్రితం ఓ భారీ చెట్టు వర్షానికి నేలకొరిగింది. జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్ సిబ్బంది రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను కొట్టివేసి పక్కన పడేశారు. అప్పటి నుంచి వాటిని తొలగించలేదు. దీంతో ఆ ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. కాలనీవాసులు వ్యర్థాలను తొలగించాలని ఫిర్యాదు చేసినా సదరు అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ధాన్యం తరలింపు



గుమ్మడిదలలో ధాన్యం కేంద్రం వద్ద అధికారి శ్రీనివాస్ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యంను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వర్షాలు కురుస్తుండటంతో రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. సాధ్యమైనంతవరకు కల్లాల్లో ఉన్న ధాన్యంను తరలిస్తున్నామని శ్రీనివాస్ తెలిపారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయ్ ఎల్లండి

ఇల్లినోస్ యూనివర్సిటీ ప్రొ.డాక్టర్. విజయ్ ఎల్లండి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇలినోస్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ ఎల్లండి అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య పరిరక్షణ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని లక్ష్యంతో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చాలా మంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం లేదని, మంచి ఆహారంతో పాటు నిత్యం ఒక గంట సమయాన్ని వ్యాయామం కోసం కేటాయించాలని కోరారు. అనంతరం ఆస్క్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ బాలబోయిన సుదర్శన్ మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకులు కొల్లూరి సత్తయ్య పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం, వైద్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. బుధవారం ఆయన మనవరాలు కొసాంభీ మొదటి పుట్టినరోజు సందర్భంగా తెల్లాపూర్‌లో ఆరోగ్య అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకులు కొల్లూరి సత్తయ్య, ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ కొల్లూరి భరత్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు సతీష్‌గౌడ్, గ్రామస్తులు ఐలేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వర వాహనంపై వీరభద్రుడు



నందీశ్వర వాహనంపై వీరభద్రుడు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారిని నందీశ్వర వాహనంపై ఊరేగించారు. ప్రతిరోజు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఆలయ ఈఓ శశిధర్, నిర్వాహకులు సోమయ్య ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు



దైవసన్నిధానంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఫిలింనగర్: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఫిలింనగర్ దైవసన్నిధానంతో పాటు శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి దేవాలయం, బంజారాహిల్స్ రోడ్ నెం . 1లోని శివాలయాల్లో భక్తులు స్వామివారి సన్నిధిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకుంటున్నారు. స్వామివారికి విశేష పూజలు జరుగుతున్నాయి. శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రతి రోజూ అభిషేకం, సాయంత్రం ఆకాశ దీపోత్సవంతో పాటు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే గాంధీ



మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌లో మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కలిశారు. మాజీ మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు కలిశారు.

కేటీఆర్‌ను కలిసిన గాంధీ

తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావును శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన కేసీఆర్‌ను కలిశారు.

ఆలయ వార్షికోత్సవం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 4న ప్రారంభమైన వేడుకలు 9వ వరకు కొనసాగనున్నట్లు ఆలయ అర్చకులు కిరణ్ కుమారాచార్యులు, శేష శైలాచార్యులు తెలిపారు. పూజల్లో భాగంగా మంగళవారం ఉదయం సుందరకాండ పారాయణం, మూర్తి కుంభస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, హోమం, ధ్వజారోహణం, అరగింపు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, నిత్యహవనం, బలిహరణం, ఎదుర్కోలు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.

ఇకనైనా మొదలయ్యేనా..?

- అర్ధాంతరంగా నిలిచిన రోడ్డు పనులు
- ప్రజల ఇబ్బందులు



ఎమ్మెల్యే కాలనీ జంక్షన్‌లో నిలిచిపోయిన వీడీసీసీ రోడ్డు పనులు


బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ 1/14 లైన్ జంక్షన్‌లో రూ.12 లక్షల వ్యయంతో చేపట్టిన వీడీసీసీ రోడ్డు పనులకు జూన్ 19న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరు చేసి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సంబంధిత అధికారులకు సూచించారు. అయితే ఇప్పటివరకు అక్కడ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. పనుల నిర్వహణలో ఇంజినీర్ల వైఫల్యం అడుగడుగునా కనిపిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యే కాలనీ సమీపంలోని లోటస్‌పాండ్ ముందు, బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని ఉదయ్‌నగర్ సింగాడికుంటలోనూ సీసీ రోడ్డు పనులు ఆరు నెలలుగా ముందుకు సాగడం లేదు. గత రెండు నెలలుగా జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఎన్నికల విధుల్లో బిజీబిజీగా ఉన్నారు. అయితే అంతకు ముందే శంకుస్థాపన జరిగిన రోడ్డు పనులను ప్రారంభించడంలో నిర్లక్ష్యాన్ని కనబరుస్తున్నారు. పనుల నిర్వహణలో అధికారుల వైఖరి ప్రజాప్రతినిధులకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల ఎన్నికల సందర్భంగా ప్రచారం కోసం వచ్చిన అధికార పార్టీ నేతలు సైతం ఈ రోడ్లను చూసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సదరు ఇంజినీర్ల అశ్రద్ధ కారణంగానే పనులు ముందుకు సాగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఇంజినీర్లు మాత్రం కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు రాకపోవడంతో పనులు చేయడానికి ముందుకు రావడం లేదని పేర్కొంటున్నారు. ఇటీవలే ఎన్నికలు పూర్తయ్యాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరబోతుంది. కనీసం ఇప్పటికైనా ఖైరతాబాద్ నియోజక వర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో ఇంజినీర్లు మేల్కొని రోడ్డు పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో పాటు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు కూడా మరింత చొరవ చూపాల్సిన అవసరం ఉంది. హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలో బీజేపీ కార్పొరేటర్ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నియోజక వర్గంలో ఖైరతాబాద్ మినహా మిగతా ఐదు డివిజన్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు అనుకూలంగా ఉన్నాయి. ఆయా కార్పొరేటర్లు సైతం అదే పార్టీకి చెందినవారు కావడం గమనార్హం. ఇప్పటికైనా అందరూ సమన్వయంతో ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా నిధులు మంజూరై శంకుస్థాపనలు జరిగి నిలిచిపోయిన రోడ్డు పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



అభివృద్ధి పనుల కోసం వేసిన శిలాఫలకం

లక్ష్య ఛేదనలో ఆరోగ్యం ఎంతో ముఖ్యం

'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు



ఎస్కీలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే వారు ఎంచుకున్న లక్ష్యాలను సాధించడంతోపాటు సమాజానికి సేవ చేయగలరని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడుపుతున్నారని, దీంతో బీపీ, షుగర్‌లతోపాటు గుండె సంబంధ సమస్యలు వస్తున్నాయన్నారు.శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, ఎముక సాంద్రత పరీక్షలను నిర్వహించారు. ఎస్కీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్ లక్ష్మీకాంతరావు, ప్రిన్సిపల్ జగన్మోహన్‌రెడ్డిలతోపాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యబృందం పాల్గొన్నారు.

శివసాయి క్షేత్రంలో రుద్ర హోమం



రాయదుర్గం: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో కాశీ విశ్వేశ్వరుడికి అభిషేకం చేశారు. అనంతరం రుద్రాక్షలతో అలంకారం చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. అంతకుముందు నిర్వహించిన రుద్రహోమం పూర్ణాహుతి కార్యక్రమాన్ని వేదబ్రాహ్మణులు మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప నగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని అశోక్ నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ పుష్ప నగేష్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యతతో పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు.

భర్తపై అలిగి భార్య ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: తమ స్వగ్రామం ఛత్తీస్‌గఢ్‌కు వెళ్ళిపోదామని భార్య భర్తను అడగడంతో కొంత నగదు సంపాదించుకున్న తర్వాత వెళ్దాం అని చెప్పి కూలి పనికి వెళ్లిపోగా అలిగి భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బీడీఎల్ సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోర్బా జిల్లా.. సారాయిపల్లి గ్రామానికి చెందిన దీపక్ పటేల్ భార్య సోనియా యాదవ్‌తో కలిసి ఆరు నెలల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం ఘనపూర్ గ్రామంలో ఉంటూ మేస్త్రి వద్ద పని చేస్తున్నాడు.అయితే సోనియా యాదవ్ ఇక్కడ ఉండడం ఇష్టం లేదని, స్వగ్రామానికి వెళ్ళిపోదాం అని మంగళవారం అడగడంతో భర్త కొంత నగదు సంపాదించుకున్న తర్వాత వెళ్దాం అని చెప్పి పనికి వెళ్ళిపోయాడు. దీంతో అలిగిన సోనియా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొంది. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.